క్లుప్తంగా

'ఆరోగ్య మహిళ'కు స్పందన



చెన్నారావుపేట : ఆరోగ్య మహిళ కార్యక్రమానికి మహిళల నుంచి విశేష స్పందన వస్తుందని డాక్టర్ సరోజ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతి మంగళవారం మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ ప్రేమలత, నర్సులు, ఏఎన్ఎంలు, సిబ్బంది ఉన్నారు.

అన్నదానం

నల్లబెల్లి : మండలంలోని సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో మైలగాని భాస్కర్ హనుమాన్ భక్తులకు మంగళవారం అన్నదానం ఏర్పాటు చేశారు. ఎంపీపీ దంపతులు భక్తులకు అన్నం వడ్డించారు. కార్యక్రమంలో కొండా కృష్ణస్వామి, భక్తులు పాల్గొన్నారు.

చేతిపంపులకు మరమ్మతు



వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని వడ్లకొండలో రిపేరులో ఉన్న బోరుబావులు (చేతిపంపు)కు మంగళవారం గ్రామపంచాయతీ సిబ్బంది మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆమడగాని రాజుయాదవ్ మాట్లాడుతూ.. వేసవి కాలంలో గ్రామస్తులకు తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యగా బోరుబావులకు మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఉప్పలయ్య, పంచాయతీ కార్యదర్శి సునీల్, మెకానిక్ చంద్రయ్య, గ్రామస్తులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విమర్శలు హాస్యాస్పదం

ఖానాపురం : ఖానాపురం మండలంలో మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఎక్కడ అభివృద్ధి చేశారో తెలపాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్ మంగళవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలంలో ప్రస్తుతం మాధవరెడ్డి వర్గం మాత్రమే ఉందని, కాంగ్రెస్ పార్టీ కాదని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచిన సమయంలో ఏమైనా అభివృద్ధి చేశారా అని ప్రశ్నించారు. మనుబోతులగడ్డలో గొల్లకురుమలకు ఇచ్చిన హామీ ప్రకారం బీరన్న గుడి నిర్మాణం ఎందుకు నిర్మించలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీని విమర్శించలేక బీజేపీని విమర్శించడం హాస్యాస్పదమన్నారు.

ముగిసిన 'పది' పరీక్షలు



చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్ మోడల్ స్కూల్, చెన్నారావుపేట హైస్కూల్‌లో నిర్వహించిన పదో తరగతి వార్షిక పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. హాస్టల్‌లో ఉన్న విద్యార్థులు ఇంటి బాట పట్టారు.

అనుమతి తప్పనిసరి

ఖానాపురం : మండల శివారులో నిర్మిస్తున్న మినీ ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి అనుమతి తప్పకుండా తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి సుప్రజ సూచించారు. ఈ మేరకు మంగళవారం నోటీసులు జారీ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తున్నట్లు తమదృష్టికి వచ్చిందని, అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టడం గ్రామ పంచాయతీ చట్టం ప్రకారం విరుద్ధమని తెలిపారు.

బీఆర్ఎస్‌కు కార్యకర్తలే బలగం

పరకాల : బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే పెద్ద బలగమని స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో స్థానిక మున్సిపల్ పరిధిలోని 22 వార్డుల పార్టీ ముఖ్యనాయకులతో మంగళవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరై మాట్లాడారు. దేశంలో కాంగ్రెస్ పార్టీకి కాలం చెల్లిపోయిందన్నారు. బీజేపీకి బుద్ధి చెప్పేలా కార్యకర్తలు సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు.

నాడు లవకుశ.. నేడు బలగం

చెన్నారావుపేట : లవకుశ సినిమా విడుదలైన సమయంలో నాడు గ్రామాలలో టీవీల ద్వారా, పరదాల ద్వారా వీక్షించారు. ఇన్నాళ్ల తర్వాత మళ్లీ బలగం సినిమాను ప్రత్యేకంగా సర్పంచ్‌లు చొరవ తీసుకొని గ్రామ ప్రజలు వీక్షించేలా ప్రదర్శిస్తున్నారు. కుటుంబాలలో గొడవలతో సాధించేది ఏమి లేదని, అందరం ఒక్కటిగా ఉండి సంతోషంగా శేష జీవితాన్ని గడపాలనే ఆలోచనతో బలగం సినిమా ఉందని సర్పంచ్‌లు తెలిపారు. సోమవారం రాత్రి కాల్‌నాయక్ తండాలో స్థానికులకు సినిమా ఆసక్తిగా తిలకించారు.



నెక్కొండ: పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు



నల్లబెల్లి: పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ సునీత



నర్సంపేట: బీజేపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ప్రకాశ్

మహనీయుడు జ్యోతిబా పూలే

మహిళలపై జరుగుతున్న వివక్షను సమూలంగా నిర్మూలించేందుకు, స్త్రీ విద్య, ఉద్యోగాల్లో సమానత్వాన్ని కల్పించేందుకు మొదటగా ఉద్యమించిన మహనీయుడు మహాత్మా జ్యోతిబా పూలే అని పలువురు వక్తలు కొనియాడారు. జిల్లావ్యాప్తంగా మంగళవారం పూలే జయంతిని పురస్కరించుకొని పూలే చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న యూఎస్ఎఫ్ఐ, ఏబీఎస్ఎఫ్ నాయకులు



గీసుకొండ: మనుగొండలో పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



వర్ధన్నపేట: నివాళులర్పిస్తున్న అంగోత్ అరుణ



నర్సంపేట: సీపీఎం కార్యాలయంలో..



నర్సంపేట రూరల్: నివాళులర్పిస్తున్న నరేశ్



సంగెంలో..



చెన్నారావుపేట: కస్తూర్బా విద్యాలయంలో..



చెన్నారావుపేట: బీఎస్పీ ఆధ్వర్యంలో..



దుగ్గొండి: పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మార్పీఎస్, ఏబీఎస్ఎఫ్ నాయకులు



వర్ధన్నపేట: పూలమాల వేస్తున్న బీజేపీ నాయకులు

నాగేంద్రస్వామి ఆలయంలో చైత్రమాస పూజలు



పూజలు చేస్తున్న భక్తులు, (ఇన్‌సెట్‌లో) మల్లెపూల అలంకరణలో నాగేంద్రస్వామి

గీసుకొండ : మండలంలోని ఊకల్‌హవేలిలో గల ప్రసిద్ధ నాగేంద్ర సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం చైత్రమాస పూజలను నిర్వహించారు. శ్వేతనాగు అవతారంలో దర్శనం ఇచ్చిన స్వామివారిని గర్భగుడిలో కోటి మల్లెపూలతో అలంకరించారు. వసంత రుతువు సందర్భంగా సర్పసూక్తి అభిషేకం, అర్చనలను ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్ష శరవణకుమార్‌లు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ బాబురావు, రవీందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే ప్రశాంత జీవనం

సంగెం : ఆధ్యాత్మికతతో ప్రజలందరు ప్రశాంతమైన జీవనం గడుపవచ్చని సీతారామచంద్ర ఆలయ చైర్మన్ గోగుల రాజేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాట్రపల్లిలోని శ్రీరామ భజన మండలి ఆధ్వర్యంలో సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన మైక్‌సెట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూలుగు సాగర్‌రెడ్డి, ఎంపీటీసీ గాయపు ప్రచుర్ణ భాస్కర్‌రెడ్డి, ఆలయ అర్చకులు కొడకండ్ల శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే అరూరి రమేష్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేష్ తదితరులు

వరంగల్ (పర్వతగిరి) : గ్రామాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. ఈ మేరకు మండలంలోని అన్నారం గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన నూతన అంబేడ్కర్ విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో రూ.కోటి 40లక్షలతో నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రం, పల్లె ప్రకృతి వనం, శ్మశాన వాటిక, డంపింగ్ యార్డు, హైమాస్ట్ లైట్లు, సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. అలాగే రూ.1.50కోట్లతో అన్నారందర్గా చెరువు కట్ట సుందరీకరణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లూనావత్ కమలపంతులు, జెడ్పీటీసీ సింగ్‌లాల్, వైస్ ఎంపీపీ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సర్వర్, పీఏసీఎస్ చైర్మన్ మోటపోతుల మనోజ్‌గౌడ్, సర్పంచ్, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

'టెండర్లు పిలవండి'

మున్సిపల్ చైర్‌పర్సన్ అంగోత్ అరుణ



మాట్లాడుతున్న అంగోత్ అరుణ

వర్ధన్నపేట : పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో నాలుగు షటర్లను కిరాయి(అద్దె)కి ఇవ్వడానికి నిబంధనలు రూపొందించి టెండర్లను పిలవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అంగోత్ అరుణ.. కమిషనర్‌ను ఆదేశించారు. మంగళవారం పట్టణ కేంద్రంలో మున్సిపాలిటీ కార్యాలయంలో నెలవారి సాధారణ సమావేశం అరుణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనారోగ్య కారణాలు, వయసు మీద పడిన సిబ్బంది స్థానంలో వారి కుమారులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నామన్నారు. రానున్న వేసవి దృష్ట్యా నీటి సరఫరాలో పైపులైన్ సమస్యలు తలెత్తకుండా మరమ్మతులు చేస్తామన్నారు. ఈ మేరకు తీర్మానాలు చేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

వేసవిలో కూలీలు జాగ్రత్తలు పాటించాలి



ఉపాధి పనులు ప్రారంభిస్తున్న అనిమిరెడ్డి

రాయపర్తి : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా పని చేస్తున్న కూలీలు తగు జాగ్రత్తలు పాటించాలని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని తిర్మలాయపల్లిలో ఉపాధి హామీ పనులను ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న దృష్ట్యా సకాలంలో పనులు చేపట్టేలా పాటు పడాలని, తాగునీరు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గజవెల్లి అనంత ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి నల్లతీగల సంతోష్, వార్డు మెంబర్స్, ఫీల్డ్ అసిస్టెంట్ అన్నేపు యాకలక్ష్మి, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తే కేసులు నమోదు

ఖానాపురం : అక్రమంగా మట్టి తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై తిరుపతి హెచ్చరించారు. ఈ మేరకు మండలంలోని అశోక్‌నగర్ శివారులోని దూసముద్రం చెరువు మత్తడి వద్ద నుంచి పర్శనాయక్‌తండాకు మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌లను మంగళవారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు తప్పకుండా తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు, తరలింపులు చేపడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.



ట్రాక్టర్‌లో మట్టి నింపుతున్న పొక్లెయినర్

బీఆర్ఎస్ విధానాల్ని ఎండగట్టాలి

బీజేపీ రాష్ట్ర నాయకుడు సోమయ్యగౌడ్



నిరుద్యోగ మార్చ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సోమయ్య తదితరులు

రాయపర్తి : బీఆర్ఎస్ పార్టీ మోసపూరిత విధానాలను ఎండగట్టాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు పెద్దగోని సోమయ్యగౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఈ నెల 15న వరంగల్‌లో తలపెట్టిన నిరుద్యోగ మార్చ్ విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు వడ్లకొండ రవి అధ్యక్షతన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీపై ఉద్యమానికి బీజేపీ ఉద్యమ కార్యాచరణతో 30 లక్షల మంది నిరుద్యోగుల భవిష్యత్ కోసం పాటుపడుతోందన్నారు. ఈక్రమంలో కుట్రపూరితంగా బీజేపీ నాయకులపై బీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడం అప్రజాస్వామికమని అన్నారు. ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించి బాధ్యులైన ఐటీ మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలన్నారు. అలాగే నష్టపోయిన నిరుద్యోగులకు రూ.లక్ష చొప్పున పరిహారం సత్వరమే అందజేయాలని డిమాండ్ చేశారు. బీజేవైఎం ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, అసెంబ్లీ కన్వీనర్ ఎనగందుల శ్రవణ్ కుమార్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శులు నూనె అనిల్, బొమ్మెర కుమార్, జిల్లా కార్యదర్శి రాపాక ప్రశాంత్, మోర్చా అధ్యక్షుడు గణేష్, ప్రధాన కార్యదర్శి సుమన్, బీజేపీ నాయకులు అనిల్, వెంకటేశ్వర్లు, అశోక్, శివనేత్రతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి




వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నర్సంపేట : యాదాద్రి జిల్లా ఆలేరులో ఈ నెల 25, 26, 27తేదీల్లో జరిగే అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) తెలంగాణ రాష్ట్ర రెండో మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిలి ప్రతాప్‌రెడ్డి, జిల్లా నాయకుడు గట్టి కృష్ణ కోరారు. ఈ మేరకు పట్టణంలోని న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో మహాసభల వాల్ పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 25న మధ్యాహ్నం 12గంటలకు మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణం నుంచి ప్రదర్శన నిర్వహించి అనంతరం 2గంటలకు బహిరంగ సభ జరుగుతుందని, 26, 27తేదీల్లో బేబక్కనగర్ ఎస్ కన్వెన్షన్ హాలులో ప్రతినిధుల సభ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జక్కుల తిరుపతి, సారంగపాణి, ఇనుముల కృష్ణ, భద్రాద్రి, బొమ్మగాని మల్లయ్య, సారయ్య, రాజేష్, చంద్రన్న, రవి, శంకరయ్య, ఐలోని, తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను వినియోగించుకోవాలి

నల్లబెల్లి : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎంపీపీ ఊడుగుల సునీత అన్నారు. మండలంలోని ముచ్చింపుల తండాలో కంటివెలుగు శిబిరాన్ని ఎంపీపీ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెండో విడత ప్రజల నుంచి విశేష ఆదరణ వస్తుందన్నారు. ఈ శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడమే కాకుండా అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తున్నట్లు తెలిపారు. టీఆర్ఎస్ నాయకులు గందె శ్రీనివాస్ గుప్త, డాక్టర్ నవీన్, సూపర్ వైజర్ మాలోత్ కిషన్, సర్పంచ్ గుగులోత్ రవళి, ఉప సర్పంచ్ గుగులోత్ సురేందర్ నాయక్, గుగులోత్ సమ్మయ్య నాయక్, పంచాయతీ కార్యదర్శి అనిల్, అంగన్ వాడీ టీచర్స్, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



నల్లబెల్లి: కళ్లద్దాలు అందజేస్తున్న ఎంపీపీ సునీత

ముగిసిన కంటి వెలుగు శిబిరం

వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని వడ్లకొండలో మార్చి 27న ప్రారంభమైన కంటి వెలుగు శిబిరం మంగళవారం ముగిసిందని సర్పంచ్ ఆమడగాని రాజుయాదవ్ చెప్పారు. గ్రామంలో 15రోజులుగా కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించిన వైద్యాధికారులు, ప్రోగ్రాం ఆఫీసర్లు, నర్సులు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి హామీని నిర్వీర్యం చేయొద్దు



చెన్నారావుపేట: జల్లీలో..



దుగ్గొండి: కేంద్ర ప్రభుత్వానికి ఉత్తరాలు పోస్ట్ చేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్, ఎంపీపీ, రైతులు

ఖానాపురం : ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడం సరికాదని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్ రావు అన్నారు. ఈ మేరకు మండలంలోని మనుబోతులగడ్డలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉత్తర యుద్ధం కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, సర్పంచ్ సోమయ్య, వల్లెపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

'కేంద్రంపై పోరు ఉధృతం చేస్తాం'

చెన్నారావుపేట : ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేసే వరకు ఉత్తర యుద్ధం పోరును ఉధృతం చేస్తామని వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బానోత్ పత్తినాయక్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ బుర్రి తిరుపతి అన్నారు. ఈ మేరకు మండలంలోని బాపునగర్, జల్లీ, లింగగిరి, ఖాదర్‌పేట గ్రామాలలోని రైతులు, కూలీలు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రికి ఉత్తరాలను మంగళవారం పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాజకీయాలకు అతీతంగా ప్రజలు, రైతులు, కూలీలు ఉత్తరాలు పోస్ట్ చేస్తున్నారని అన్నారు. ఉపాధిహామీని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేసే వరకు పోరాటాలు ఆపేది లేదన్నారు. మహ్మద్ రఫి, మురహరి రవి, కేతిడి వీరారెడ్డి, తూటి శ్రీనివాస్, కంది కృష్ణ చైతన్యరెడ్డి, తొగరు చెన్నారెడ్డి, బద్దునాయక్, నాయకులు, సర్పంచ్‌లు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వానికి 933 ఉత్తరాలు..

దుగ్గొండి : మండలంలోని గొల్లపల్లి, మల్లంపల్లి, బొబ్బరోనిపల్లి గ్రామాలలో 933 మంది కేంద్ర ప్రభుత్వానికి మంగళవారం ఉత్తరాలు పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి పథకంపై కక్ష సాధింపు ధోరణి అవలంబిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కాట్ల కోమల, భద్రయ్య, సుకినె రాజేశ్వర్‌రావు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

ఉత్తర ఉద్యమంలో భాగస్వాములు కావాలి

నల్లబెల్లి : బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన ఉత్తర ఉద్యమంలో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్ అన్నారు. మండలంలోని రేలకుంట, నందిగామ, లెంకాలపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఉత్తర ఉద్యమాన్ని చేపట్టారు. బీఆర్ఎస్ నాయకులు, రైతులు, కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని కేంద్ర మంత్రికి ఉత్తరాలు పోస్టు చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సిద్దురి రత్నాకర్ రావు, నాగులగాని సలేంద్ర, మేకల లక్ష్మి, నాయకులు గండు శ్రీధర్, కందికొండ రాములు, ఆకుల సాంబరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంపై ప్రచారం



రాయపర్తి : మండల కేంద్రంలో నేడు నిర్వహించనున్న బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన సభ కోసం పార్టీ శ్రేణులు మంగళవారం ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు బిల్లా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో మంత్రి దయాకర్‌రావు చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు తీరుపై చర్చిస్తూ పార్టీ బలోపేతానికి పాటుపడేందుకు దోహదపడే సమ్మేళనానికి అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆకుల సురేందర్ రావు, జిల్లా పార్టీ నాయకులు వనజరాణి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఎండీ నయీమ్, ఎంపీటీసీ ఐత రామ్ చందర్, మండల పార్టీ సహాయ కార్యదర్శి రామారావు, నాయకులు చందు రామ్, పోగులకొండ వేణు, చందు సతీష్, పూజారి సంతోష్, ఐత రవి, ఉబ్బని మధు పాల్గొన్నారు.